
"అల్లుడుగారు వచ్చారే!" అన్నాడు సీతప్ప - కంఠస్వరం పదిబారల దూరం విన్పించేలా.

వినవలసిన ఆవిడ వింది.

"అట్లా అరుస్తారేం! రాక ఏమవుతాడేం?" అన్నది మహాలక్ష్మి, రవ్వంత అలుసు భావాన్ని స్ఫురింపజేస్తూ.

విన్న అల్లుడు ఖిన్నుడయ్యాడు. అల్లుడు విన్నాడేమోనని సీతప్ప తొట్రుపడ్డాడు. అయినా అసలావిడ నోరు అంతతో ఆగిందికాదు.

"ఈ మాట బులిపెంగా చెప్పాల్టండీ! పిలుపు వెళ్ళాక రాకమానరు గదా! వచ్చినతరువాత ఇవతలవాళ్ళని వీలయినంత మేరకు పిండకపోరు గదా!" అందావిడ, సూర్యకాంతం స్థాయిలో. సీతప్ప యిరకాటంలో పడ్డాడు. అవతల, చావిట్లో, అల్లుడు ఈ రభస ఆసాంతమూ వింటూనే ఉన్నాడు. తొలుత తొట్రుపడ్డా, మఱుక్షణంలో తన పరువు మాసేవిటన్న ఆలోచన కలిగి, సీతప్ప పంచ ఎగగట్టాడు. వంటగది గుమ్మందగ్గఱ నిలబడి, ఉబుకుతున్న కోపాన్ని అణచి



పెట్టుగుంటూనే మంద్రస్థాయిలో, "నీ కేమైనా మతి పోయిందేవిటే! అల్లుడు వింటున్నాడనయినా లేదు," అన్నాడు.

పండుగలకు అల్లుళ్ళు అత్తారిళ్ళ కేగడం లోకంలో జరుగుతున్న తంతే. విశేష మల్లా ఏమంటే, తొలిపండుగ అత్తారికీ, అల్లుడికీ సరదా తీర్చేది. పాపం! వెంకట్రమణ ఖర్మ ఏమిటో తొలిపండక్కు సంబరపడుతూ అత్తారింటికి వచ్చినవాడు ఉసూరుమంటూ చావడిలోనే కూలబడ్డాడు. హృదయ రాజ్ఞి ఇంకా కంటపడనేలేదు. అత్తగారు కాళీస్వరూపా న్నెత్తి, గతాన్ని త్రవ్వి ముందు బోసుకుంటూ అల్లుడి మీద నిప్పులు చెరుగుతున్నది. వెంకట్రమణకూ అత్తగారికీ బహుశః గతజన్మ లోని వైరుధ్యం శేషించి ఉండవచ్చు. కాకపోతే, ఈ జన్మలో తన అత్తగారి తమ్ముడికి, ఆమె కడుపున బుట్టిన కూతురు మనసీయ నని ఖచ్చితంగా చెప్పడం వెంకట్రమణ నుదుట బ్రహ్మ రాసిన రాతలో నిఘీ ప్తమై, శత్రుత్వంగా రూపొంది ఉండనోపు.

మహాలక్ష్మికి మహాధీరుడైన తమ్ముడొక డున్నాడు. పేరు సత్యమూర్తి. నామధేయస్థమైన సత్యానికీ, కార్యాచరణకూ ఏకాన్తపొంతనా కనిపించని మనిషి. నిజం చెప్పడం అతనికి చేతకాదు. అంటే ఎప్పుడూ అబద్ధం చెప్పడమే పనిగా పెట్టుగున్నాడనికాదు. పరపీడన కుపయోగించేది సత్యమైతే అది ఆతనినోట దాగదు. అంతటివాడామె తమ్ముడు. ఆ మహాశయుణ్ణి, అంతటి సద్గుణ సంపన్నుని పెండ్లి చేసుకోమంటే ససేమిరా అన్న దని కూతురిమీద ఆమెకు బోలెడంతకోపం వచ్చింది. అసలువిషయంమరొటుంది; హైస్కూలు చదువుల్లో వెంకట్రమణా, విజయా పరిచితులు. అంతేగాదు. విజయ తన మనస్సును వెంకట్రమణ చేతుల్లో పెట్టిందట! అంతతో వూరుకోవచ్చా! ఈ నాటి ఆడపిల్ల లక్షణమది కాదు. మనసుకు నచ్చినవాడిని, మమతలు పెంచుగున్నవాడిని ఏదో విధంగా తనవాడిగా చేసుకోగలదు. విజయా అంతే చేసింది.

"నాన్నారూ! వెంకట్రమణ మూర్తికి నా మనస్సప్పిచ్చాను. ససేమిరా ఆయన తిరిగి యివ్వ నంటున్నాడు" అం దాపిల్ల – ఓ సాయంకాలంపూట, అమ్మ దూరంగా వున్న అదనుచూసి. సీతప్ప ముక్కుమీద వేలేసుగున్నాడు. ఆశ్చర్యాన్నుండి తేరుకుని, కూతురువంక చూసి నవ్వాడు.

"మ ఱి, అప్పు తీసుకున్నప్పుడు ఏమనుకున్నాడు?"

"తిరిగియివ్వలేనా అనుకున్నారు"

అంది ముసిముసి నవ్వులు నవ్వుతూ పెళ్ళికూతురు.

కూతురు సమాధానం ఆయనకు నవ్వు తెప్పించింది. అయినా, ఆక్షణం మాత్రం యస్వీ రంగారావై -

"అదేమిటమ్మా! అప్పిచ్చినదాన వంత అలుసిస్తే ఎలాగు? బకాయిదారుడిని ముక్కుగుద్ది అడగాలి. చూడగా చూడగా నీకు మంచివాడే దొరికాడు" అన్నాడాయన లాల్చీ జేబులో చుట్టకోసం వెదుకుతూ.

ఈ సంభాషణ జరిగిన మొన్నాడు సీతప్ప కాబోయే అల్లుడి గదిలో కూచుని, "ఇదేమిటోయ్! ఇంతపని చేశావ్? మా అమ్మాయి హృదయాన్ని అప్పుతీసుగున్నావట! ఎన్నాళ్ళకు తిరిగిస్తావ్?" అన్నాడు బుంగ మీసాలనుండి నవ్వుల కెరటాలు వెలికి వస్తూండగా. ఆదర్శ యువకుడు వెంకట్రమణ, "నాకేమీ కట్నం ఆశ లేదులెండి" అని స్పష్టపరిచాడు, ఒకింత సిగ్గుపడుతూ.

ఆపై జరగవలసిందేమో జరిగిపోయింది. సంప్రదింపు లయినాయి. తాంబూలా లుచ్చుగున్నారు. వెంకట్రమణ పెండ్లికొడుకు, విజయ పెండ్లికూతురు అన్నారు. చిన్నప్పుడు నేర్చుగున్న మంత్రాల నన్నిటినీ పురోహితుడు లక్షణంగా వల్లించాడు. వెంకట్రమణ సిటిజన్‌షిప్ క్లాసులో నేర్చుగున్న ముడులు వేయుటను ముచ్చటగా మూడుసార్లు బహిరంగంగా ప్రదర్శించాడు. బాజాలు మ్రోగాయి. అక్షతలు కురిశాయి.

కూతు రింతపట్టుదలతో తన తమ్ముడిని కాదనీ, తను కోరుకున్నవాడిని పెండ్లి చేసుకోవడం కూతురు జీవితాన్ని నందనవనంచేసినా, మహాలక్ష్మిగారి మనస్సు అగ్నిగుండమేఅయింది. అందునా, అల్లుడిమంచితనం ఆజ్యంగా భాసిల్లింది.

మంచితనం ఎదుటివాళ్ళ దృష్టిలో మెతకదనం. వెంకట్రమణకు అత్తగారి స్వభావం కొత్తకాదు. కాని, ఆమె ఎన్నడూ ఇలా తనకు వినిపించేలా గతంలో అరవలేదు. అంతేగాక, అల్లుడి ఎడల ఇంత వైముఖ్యం, ఇంత కసి తన అంతరంగంలో అంతర్భూతమై ఉన్నాయనికూడ ఆమెఎన్నడూ స్పష్టపరచాలని ప్రయత్నమాత్రమైనా చేయలేదు. ఈ రోజదేం పాపమో! నిశ్చలనీరాన సుడిగుండ మకస్మాత్తుగా ఉద్భవించినట్లు, ఒక్కసారిగా అగ్నిశిఖరం బ్రద్దలైనట్లు, ఆవిడ నోటికుట్లు తెంపుకుంది.

అందుకే అల్లుడి కంత ఆశ్చర్యం. పులిముందు నిలిచి, హంటర్ విదలించినట్లు సీతప్ప అదలించినా, మహాలక్ష్మి భయపడలేదు. ఒకవేళ అట్లా భయ

పడితే ఆవిడ 'మహా' లక్ష్మి కానేరదు, కాదు.

"వింటే ఏం ?" మొరాయించిందామె.

సీతప్ప దవడలు నొక్కుకున్నాడు.

"నీక్కోపంవుంటే కూతురు కాపురం పాడుచేస్తావుటే" అన్నాడాయన, భవిష్యత్తులోకి - కూతురు కాపురంలోకి - చూస్తూ.

ప్రకాశమానం కాని శబ్దాలతో గుసగుసలాడుతూ, పిండి వంటలు చేయడానికుపక్రమించింది మహాలక్ష్మి.


కూతు రందించిన నీళ్ళచెంబూ, నీళ్ళగ్లాసూ అల్లుడిదగ్గ రుంచాడు, మనస్సులో ఇన్ని నీళ్ళు చల్లుకుని సీతప్ప. అల్లుడు మావగారి దుగ్ధను అర్థం చేసుకున్నాడు. అతనికి అర్థం కానిదల్లా అత్తగారి ప్రవర్తనే.

అట్టి అవాంతరస్థితిలో, తన ప్రియ భార్య, తన ప్రాణం, తన సర్వస్వమూ అయిన విజయ ఏ గుమ్మం చాటు నుండైనా చూపులు విసరుతున్నదేమో అని నాలుగువేపులా కలియజూచాడు వెంకట్రమణ. నిరాశ నిట్టూర్చింది.

అత్తగారి ప్రవర్తనకు కారణం యిదని యిదమిద్ధంగా తెలీక పోవడంతోబాటు, ఆమెను మంచిచేసుగోవడం ఎట్లాగో సుతరామూ అతనికి అర్థమైంది గాదు. ప్రవర్తనా యవనికాభ్యంతరాన తారాడే కారణం దృశ్యమాన మైనప్పుడు, ఆ రెండోపని సులభ మౌతుంది. కారణాల తోరణాలకు మనసు మరులుకొనగా, కాళ్ళ మీద చెంబెడునీళ్ళు పోసుకుని, నాలు గ్గుక్కలు దిగమింగి, టవల్‌తో కాళ్ళొత్తుగుంటూ కూచున్నాడు. ఆలోచనల్లో మునిగిన వెంకట్రమణ మనలో లేకుండా పోయాడు.

ఎంతటి మంచితనమయినా చెడ్డతనం ఎదుట తలవంచవలసి వస్తుందొక్కోసారి. చెడ్డతనం ఎప్పటికీ చెడ్డతనం కాదనీ, అది మారే సూచనలున్నాయనీ అతనికి తెలుసు. కాకపోతే, చెడ్డతనం స్థానంలో మంచితనాన్ని ప్రవేశ పెట్టేందుకుగాని, లేదా చెడ్డతనాన్నే మంచితనంగా రూపొందించేందుగ్గాని సులువైన సూత్రాలను ఏ "మేడ్ ఈజీగైడ్" లోనూ అతను చదివినవాడు కాడు.

పండ్రెండు గంటలకు, మావగారి సరసన కూచుని కమ్మని గారెలతో, తీయని క్షీరాన్నంతో పసందైన కజ్జికాయలతో సుష్టుగా భోజనం చేశాడు వెంకట్రమణ. కడుపుతోబాటు కనురెప్పలూ బరు వెక్కగా, మెత్తని శయ్యపై మేను వాల్చా డతను. నిద్ర కుపక్రమిస్తూండగాకూడా, అత్తగారి కోపకారణం తెలుసుగుని అత్తగారికీ తన మంచితనానికి సత్సంబంధాలు




"నీ ఇంగ్లీషు అఘోరించి నట్టేఉంది. ఇరవైసార్లు ఇంపోజిషన్ రాయమంటే పదిహేడుసార్లు రాశావేం ?"

"నాకు లెఖ్ఖలు రావండీ !"

---

సమకూర్చా లనీ, తద్వారా అత్తగారి దృష్టిలో తన స్థానానికి విలువ పెంచు గోవా లనీ సాధనాలు వెదుక ప్రయత్నించాడు. నిద్ర ముంచుకొచ్చింది.

గడియారం నాలుగు కొడుతూండగా విజయ కాఫీగ్లాసుతో తొలిసారిగా భర్తముందు ప్రత్యక్ష మైంది. బద్ధకంగా ఆవలిస్తున్నవాడల్లా, దేవీ దర్శనం కాగానే, చటుక్కున లేచి నుంచున్నాడు. విజయ సిగ్గుపడింది. మెల్లన నడచి, కాఫీగ్లాసు అక్కడే వున్న టేబుల్ మీద ఉంచి, తలవంచుగుని నిలబడింది — భర్తపాదాలవంక చూస్తూ. దగ్గఱకు వస్తా యనుకున్న పాదాలు బయటకు నడిచాయి. ఆశ్చర్యపడిం దామె. తలెత్తిచూసింది. వరండాలో ముఖం కడుక్కుంటున్నాడతను. టవల్ తో తుడుచుగుంటూ లోపలికి వచ్చాడు. విజయ వంక చూడనేలేదు. పాపం ! కాఫీమాత్రం త్రాగాడు. అతను మాట్లాడతా డనుకుంది విజయ. ఏమనుకున్నాడో ఏమో, మూగనోముపట్టి, బట్టలు మార్చుకుని, బయటిప్రపంచంలోకి ఉరికేశాడు.

ఆ సన్ని వేశం విజయ కర్థంకాలేదు. అత్తగారిమీది కోపం అర్ధాంగిపై ప్రస

రింపజేయడమే అతని ఉద్దేశ్యమైతే, ఆ తీరు వేరుగా ఉండేది. అతని స్వభావం అది కానేకాదు. ఆలోచించింది విజయ. ఒక పట్టాన అంతు పట్టలేదు. తను భర్త రాగానే ఎదుట పడలేదని కాబోలు ఇంత ఆగ్రహం!

చీకటిపడి, ఎక్కడెక్కడి పక్షులూ గూటికి చేరినా, అల్లుడింటికి రాలేదన్న వార్త సీతప్పకు పిడుగుపాటైంది. ఆయన పంచ ఎగగట్టాడు.

"చూశావులే! అల్లుడి కోపం వచ్చింది చెబితే విన్నావూ" అంటూ చిందులు త్రొక్కసాగాడు.

మహాలక్ష్మిమాట్లాడలేదు. సీతప్పకు కోపం పెరగడాని కిదో కారణమైంది.

"కోపం వస్తే దాచుకోవాలిగాని, అంతకోపాన్నీ అల్లుడిమీద చూపిస్తావులే! నేను చెబుతూనే ఉన్నాను. నీకు తెలిసేదెట్లా గదూ ఇదిగో - ఇప్పుడనుభవించు" అన్నాడు సీతప్ప గదిలో ఆ మూలనుండి ఈ మూలవరకూ నడుస్తూ.

మహాలక్ష్మికి బెంగగానే ఉంది. ఆమె కళ్ళు నలుమూలలా వెదికాయి. దూరంగా ద్వారబంధం వెనుక రెండు కళ్ళు తనవంక చూస్తూ కనిపించి, అదృశ్యమయ్యాయి. ఆ కళ్లు తన్నెంత భయంకరంగా చూస్తున్నాయో వాటిలోని అగ్ని శిఖలే! తలచుకుని ఆమె తడబడింది. అయినా -

"ఎవరి మీదండీ ఈ కోపం —" అంది, ఆడదానికి ప్రతినిధై.

సీతప్పకి మాటతో చిర్రెత్తినట్లు అయింది. పళ్ళు పటపట లాడించి, కోపంగా భార్యవంక చూచి ఏదో అనాలని నోరు విప్పాడు.

ఆమె తిరిగి, తనలో తను అనుకుంటున్నట్లు - "నేను మాత్రం ఏమన్నాననీ! ఎదుటబడి తిట్టానా?" అన్నది ఎటోచూస్తూ.

సీతప్ప 'ఛీ' అనబోయాడు. నిజంగా అనలేదు. ఒక్కక్షణం అట్లాగే నిలుచున్నాడు. మనోగగనాన ఏదో ఆలోచనా శంపాలత తళుక్కుమన్నట్లు-చరచర బయటి అరుగుమీదికి వచ్చాడు.

## 2

ఆఫీసుల జైళ్ళనుంచి బయటపడ్డ ఖైదీల ఎదిగిన నీడలు చల్లగాలిని పీల్చుకుంటూ, "ఎంత కమ్మని సాయంకాలం" అనుకుంటున్నాయి. ఆలోచనలు నిండిన లోచనాలతో, మేడమీది కిటికీలోంచి దూరంగా చూస్తున్నాను.

కథ ఆగిపోయింది.

ముందుకు సాగడం ఎట్లాగో అర్థం కావడం లేదు.

ఎర్రసైకిలు ఇంటిముందాగింది. గుండెలు గుబగుబ లాడాయి. అది టెలిగ్రాఫ్ మెసెంజర్ సైకిలని నాకు

తెలుసు. అర్జంటు సందేశా లందజేసే మెసెంజరుడు; మా కొంపలోనివారి కెవరికో కొంపముంచేందుకో, కొండె క్కించేందుకో వార్త తెచ్చాడు. అతని అడుగులచప్పుడు నాకువినిపించకుండా ఉంటే బాగుణ్ణు.

ఏదైతే కాకూడదనుకుంటామో, అక్షరాలా అది జరిగితీరడం లక్షణం. నాకే ఆ టెలిగ్రాం. ఎక్స్‌ప్రెస్ అన్న తాటికాయలంతేసి అక్షరాలు మరింత ఎర్రనైనాయి. సంతకం చేస్తున్నపుడు, చేతులు వణికాయి. పరి పరి విధాల ఆలోచనలు రూపాలు మార్చుగుంటు న్నాయి.

"నీ పరీక్ష పోయింది —"

ఇట్లా యీనివర్సిటీనుండి నా మిత్రుడి సందేశం - ఒక్క క్షణం నాలోనిప్రాణం పైకి లేచిపోయింది. సెలవుల్లో నా మిత్రుడితోనాల్రోజులు హాయిగా గడపాలని ఇల్లువదలి ఇంత దూరం వచ్చిన నాకు బి. ఏ. పరీక్ష పోతే —

"సిస్టర్ సీరియస్ ...."

తిరుగుతున్న గుండె మరల ఒక క్షణం ఆగినట్లయింది.

ఇంతకూ, అవేమీకాదు. అసలు విషయం మరోటి. "మేరేజ్ సెటిల్డ్ స్టార్ట్ యిమీడియట్లీ"

ఒక్కసారి - ఒఖసారే — దిక్కు లన్నీ ప్రతిధ్వనించేలా, ప్రపంచజన సందోహం ఒక్కక్షణం స్తంభించి పోయేలా, నా గుండెలు అలిసి పోయేలా నవ్వా లనిపించింది.

అవును మరి! పెళ్ళి-నాకు పెళ్ళట! బ్రతుకున వెన్నెల కురిపించేందుకు, సుఖమన్నది ఏమో నిర్వచించి చెప్పేం దుకు, ఒంటరి తనాన్ని నిలువునా ఖూనీ చేసేందుకు - ఒక స్త్రీ—సుందరి- యువతి- నా దరికి జేరబోతోందట!

అయినా నేను అస్సలు నవ్వలేదు.

టెలిగ్రాంమీది పైపు అక్షరాలను మరోసారి గుణించాను.

సంబంధం కుదిరిపోయింది. సరే! ముక్కూ, మొగమూ తెలియనిపిల్లతో సంసారం చేయాలి కాబోలు! హోరి భగవాన్!

నాన్నగారి మీద నాకు బోలెడంత కోపం వచ్చింది. పెళ్ళి చేసుగునేది నేనా? ఆయనా? వైవాహిక కార్య క్రమంలో ముఖ్యుడ నైన నా ప్రమేయం ఏమీ లేకుండానే పెళ్ళి స్థిరం చేసేయడమా!

ఆలోచన వెనక్కు తిరిగింది. ఇద్దరి మరోఅర్థం - నేను పూర్వ కాలం వాడిని. తలిదండ్రులకు నచ్చిన పిల్లకే తాళిగట్టే పదహారవ శతాబ్దంవాడిని. నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది. అంతే అయిఉండాలి మా నాన్నగారి ఉద్దేశ్యం.

బరువైన పెట్టెతో మధ్యాహ్నం మూడున్నర గంటలకు ట్రైనెక్కాను-మిత్రుడి దగ్గర శలవు తీసుకుని.

"ఇంతతొందర రేమిటి?" అన్నాడు అనుమానిస్తూనే వాడు. ఏమీ తేదన్నట్లు నవ్వాను.

"మరి, వెంకట్రమణ ఏమయ్యాడు?" అనడిగాడు కథాంతం తెలుసుకోగోరుతూ.

వెంకట్రమణ ఏమయ్యాడో నాకు మాత్రం తెలుసునా? ఏ విధంగా తరువాత కథాభాగం పూరించాలో అర్థం కాని స్థితిలో నా జీవితం మలుపు తిరుగుతున్నది.

"చెబుతాను - తరువాత" అన్నాను, కదులుతూన్న బండిలో నుండి చేయూపుతూ.

కూచున్నాను గానీ, ఆలోచనలు పరుగెత్తుతూనే ఉన్నాయి. జరిగిపోతున్న దృశ్యాలకన్న, గాలివాలున బడి పారిపోతున్న బొగ్గుగాలికన్న వేగంగా ఆలోచనలు పరుగులు సాగిస్తున్నాయి.

వెంకట్రమణ ఏమౌతాడు? అతనికి కోపం వచ్చిందా? కోపం వస్తే అలకపాన్పు ఉండనే ఉన్నదిగదా! బయటి ప్రపంచలోకి పోయినవాడు తిరిగి వస్తాడా!

అనిశ్చితాలోచనా పరంపరలతో, గేటు తోసుగుని, లోపల కడుగు పెట్టాను. అమ్మ నవ్వుతూ ఎదురొచ్చింది.

రాత్రి భోజనాల దగ్గర నాన్నగారన్నారు - "ఒరేయ్ అబ్బాయ్! కమలాకరంగారి అమ్మాయిని చూశావ్?" లేదనిచెప్పి బుద్ధిమంతుడననిపించుకున్నాను.

"అచ్చు లక్ష్మిరా! రేపు వాళ్ళింటికి వెళ్ళి, ఒక్కసారి చూసిరా!" అన్నారు.

మొన్నాడు మధ్యాహ్నం కాబోయే మావగారింట్లో భోంచేస్తూ ప్రపంచ రాజకీయాల గురించీ, పరిపాలనా యంత్రాంగం గురించీ, ఆయన అభిప్రాయాలు ఓపికతో విన్నాను.

ఆయన నిజస్వరూపం తరువాత రెండునెలలకుగాని బయట పడింది గాదు.

నా అంగీకారాన్ని పొంది ఓ శుభ ముహూర్తాన మాకు (మా మావగారి కూతురుతో నని మనవి) పెద్దల సమక్షములో వివాహం జరిపించారు. ఆ తరువాతనే మామావయ్యగారివృత్తాంతం విశద మైంది. ఆయనకూ సీతప్పకూ చాలా పోలిక లున్నాయి. అయితే, మహాలక్ష్మికన్న మా అత్తగారు చదివిందిమాత్రం ఓ పది పదిహే నాకులు ఎక్కు వేగాని తక్కువమాత్రం కాదు.

కొన్నాళ్ళు గడిచాక, సంక్రాంతి




"ప్రేయసీ, మనం ఆకాశంలోకి ఏకాంతంగా తేలిపోయి, అకల్పాంతం విహరిస్తూ ఎప్పటికీ భువికి దిగిరాకుండా !!..."
"వద్దు మధూ ! వద్దు; ఎల్లుండి నా పుట్టినరోజు పండక్కి రెండు వందల మందిని పిలిచాం. నేను కనుపించకపోతే వాళ్ళంతా ఏమనుకుంటారు?"

---

వచ్చింది. తొలి సంక్రాంతికి ఠీవిగా అత్తారింట్లో అడుగుపెట్టాను. నన్ను చూస్తూనే మా చిన్నబావ రఘు – "అమ్మోయ్ ! బావొచ్చాడే !" అని చావిట్లో నిలబడి అరవసాగాడు.

"అరవకురా బావా !" అన్నా వాడు విన్పించుకోలా.

అత్తయ్య కాళికాదేవి అవతారమే అయి, సాక్షాత్కరించింది.

"పీకకోసిన మేకలా అలా అరవకపోతే, దగ్గర కొచ్చి చెప్పకూడదూ ! అబ్బబ్బ ! చెవులు గింగుర్లెత్తిపోతున్నాయి" అంటూ సోఫాలో కూలబడుతూ, " కూచో అల్లుడూ ! నిలబడే ఉండిపోయావు. ఇంటిదగ్గర అంతా క్షేమమేనా ?" అంది మగ మహారాజును తలపిస్తూ.

తల క్రిందికి వంచుకుని, చిటికెన వ్రేలు నోట బెట్టుకుని, "అంతా క్షేమమే" నన్నట్లు తలూపాను. ఆవిడ ఫక్కుమంది. నాకు మరింతసిగ్గుముంచు కొచ్చింది. క్రొత్త యుగలక్షణం.

నారాక విన్నదే తడవుగా మా ఆవిడ - లీల - పరుగెత్తు కొచ్చింది. ఎదుట తల్లి ఉన్నదన్నైనా లెఖ్ఖచేయక-

"ఎంత సేపయిందండీ వేంచేసి - ఉదయంనుండి మీకోసం చూచి చూచి

నా కళ్లు కాయలు కాచిపోయాయి.'' అంది నాపక్క జారబడుతూ.

మా అత్తగారు లేచిపోవాలా! లేదు. కొంచెమైనా సిగ్గున్నట్టు కనిపించలా:

''ఇప్పుడు నన్ను చూచి నీ కాయలు కాచిన కళ్ళు పళ్లైనట్లున్నాయి.'' అన్నాను.

ఇద్దరూ ఫక్కు మన్నారు.

''అల్లుడు చమత్కారుడేనే పాపా!'' అంది మా అత్తగారు నా ప్రయోజకత్వానికి అబ్బుర పడుతూన్నట్లు నటిస్తూ.

ఈ సారి నా నోరు మరి తెరవలేదు. ఈ లోగా మా మావగారు రానే వచ్చారు. నన్ను చూసి, ముఖమింత జేసుకుని ఎన్నో ప్రశ్న లడిగారు.

కాఫీ త్రాగి, ఒకక్షణం నిద్రపోదామని అలా బెడ్ మీద వాలాను. అరగంట తరువాత మెలుకువ వచ్చింది. లీలగా వినిపిస్తున్న మాటలు ఆశ్చర్యంగా వినసాగాను,

''అతని గురించి మరీ అంత అలుసుగా మాట్లాడకూడదు....''

''నేనేం అలుసుగా మాట్లాడాను. బావుంది! కుర్రాడుగదాయని నువ్వు అన్నాను. అదీ తప్పే?''

''ఎంతైనా అల్లుడుగదా!....''

''తప్పేం లేధులెండి. అతనికి లేని బాధ మీకెందుకు?''

కొన్నిక్షణాలు నిశ్శబ్దంలో కఱగిపోయాయి.

''పోనీలేగాని, అతనికి బహుమతి ఏ మిచ్చేది....?''

జవాబు వినిపించలేదు.

''ఏం మాట్లాడవేం!''

''బహుమతి ఎందుకు?''

రామ రామ! పండక్కు బహుమతి ఉండనే ఉండదా?


తిరిగీ నా అత్తగారి కంఠమే విన్పించింది.

''అతనికి అథం శుథం తెలియదు. ఆడపిల్లలా సిగ్గుపడడంమాత్రం తెలుసు. అంతగా, నా కది కావాలి .... ఇది కావాలి అని అడిగితే అప్పుడే చూడొచ్చు''

నాకు భలే కోపం వచ్చింది. ఆవిడను కరకర నమిలి మ్రింగేయా లనిపించింది. నేను ఆడపిల్లనా? నాకింకేమీ తెలియదూ? అయితే, మా అత్తగారికి ఒక చిన్నపాఠం చెప్పా లనిపించింది.

వాళ్ళ మాటలు నా కర్ణరంధ్ర వ్యూహంలో చొచ్చుకుపోయా యని తెలియజేసేందుకుగట్టిగాఆవలించాను.

ఏ రచయితకూ కలగని కొత్త అనుభవం నాకుకలగడం నా అదృష్టం. నేను సృష్టించుకున్న పాత్ర నేనే అయిపోతున్నాను. వెంకట్రమణకు కలిగిన భావాలే నాకూ కలుగు




"1942 లో పుట్టిన మనిషికి ఇప్పు డెన్నేళ్ళుంటాయి?"
"ఆడదా? మగాడా? మాష్టారూ!"

తున్నాయి. అతనిచుట్టూ ఏర్పడిన పరిస్థితులే, నన్నుకూడ చుట్టుకుంటున్నాయి. కొన్నివిషయాల్లో అతనికీ నాకూ ఏమాత్రమూ పోలికలు లేకపోవచ్చును. కాని, మా ఇద్దరిదీ ఒకే పాత్ర.

ఒక కోణంలో వెంకట్రమణా నేనూ ఒకే ఒక్క రూపంగా మా అత్తగారి కంటిఎదుట పడవచ్చు. అబ్బాయి అమ్మాయిని ప్రేమించడం, కావాలని ఆమెకు దగ్గర కావడం, శుభాంతంగా పెళ్ళిచేసుగోవడం సహజం. కాని, వెంకట్రమణ విషయంలో జరిగిందేమిటి? అబ్బాయి స్థానంలో విజయనుంచుని, "నాన్నారూ నేను ఫలానా అబ్బాయికిమనసిచ్చుకున్నా"ననిచెప్పి, కావాలని వెంకట్రమణను పెళ్ళిచేసుగుంది. అఫ్‌కోర్స్. తాళి కట్టింది అతనే కావచ్చు. కాని అందుకు బాగ్రౌండ్ ఆమె. అంచాత, వెంకట్రమణ ఆడపిల్లతో సమానం. నే నెట్లాగూ మా అత్తగారి దృష్టిలో ఆడపిల్లనే అయిపోతిని. ఈ కోణంనించి మా ఇద్దరిదీ ఒకే పాత్ర.

నిద్ర లేచిన తరువాత లీల కాఫీ యిచ్చింది. ఆమె ఏవిధంగా నన్ను మాట్లాడించా లని చూసినా, నేను కనీసం నవ్వనయినా లేదు. కళ్ళెత్తి

కూడనూలేదు. గడగడ కాఫీ త్రాగి, బట్టలు మార్చుకుని వెంకట్రమణలాగే బయటపడ్డాను.

ఏమైతే నే నుద్దేశించానో అందుకు లీలతో మాట్లాడక పోవడమూ, ఆగ్రహ నటనమూ ఉపకరించాయి. ప్రణాళికలు ఫలించా లంటే ప్రచ్ఛన్నంగా కొంత నటనా, దుష్టబుద్ధీ, తనవాళ్ళపై ఘనకోపమూ కావాలట ! ఏ దెటుపోతే తనకే మనుకోడం కీర్తికారకం కాదుగదా !- అపకీర్తి దాయకం అవుతుంది. నిజానికి మా అత్తగారి మాటల్లో దురుద్దేశ్యం లేక పోవచ్చును. కాని, ఆమె ఆమాటలన కూడదనిపించింది నాకు.

సినిమా హాల్లోంచి బయటకు వచ్చాను. చలి చల్లగా ఉంది. చీకటి ముఖం మరింత నల్లబడింది. అసహజమూ, అప్రాకృతికమూ అయిన విచిత్ర లోకాన్నుండి, బయటపడి, ఒంటిగా గాలిపీల్చుకున్న రెండుక్షణాలకు అత్తారిల్లు గుర్తుకు వచ్చింది.

వెంటనే అత్తగారి స్వరూపమూ గుర్తుకు వచ్చింది.

మెట్లెక్కుతున్నపుడు లోపలినుండి మా అత్తగారి రోదనధ్వని స్పష్టమై, టిట్టున వినరాసాగింది.

లోపల కడుగు పెట్టిన నాకు - ఆదృశ్యం వింతగా కనిపించింది.

సోఫాలో కూచున్న అత్తగారి కళ్ళకు జోడులేదు. జోడుకళ్ళనుండి కన్నీరు ధార లౌతున్నది. దూరంగా గుమ్మాని కానుకుని లీల బిక్కు బిక్కుమంటూ చూస్తున్నది. మావగారు గది మధ్యగా గిర్రున అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆయన కన్ను లింకా నిప్పులే కురిపిస్తున్నాయి. మా పెద బావ వగైరా ఆ ఫామిలీ బృందం కొలువు తీర్చింది.

నన్ను చూడగానే మావగారు కెవ్వున అరచి, ఒక్కసారి గట్టిగా కౌగలించుగున్నారు.

"నాయనా ! ఎక్కడికి పోయావు? మా మీద కోపం వచ్చిందా ?" అన్నారు, తన ఆవేదన బయటపడి ముక్క లౌతుండగా. మా అత్తగారు చటుక్కునలేచి -

"నాయనా! ని న్నేమయినా నేను తప్పుగా అన్నానా ! కోపంవచ్చి వెళ్ళిపోయావా ! ఎక్కడికి వెళ్ళావు అల్లుడూ ! ?" అన్నది, కన్నీళ్ళు తుడుచుగుంటూ.

నేననే వెంకట్రమణ లీల ఆనేవిజయ వంక చూస్తూ అత్తగారిలో కలిగిన మార్పుకు సంతోషిస్తూ,

"లేదు అత్తగారూ ! 'చదూకున్న అమ్మాయిలు' సినిమా బాగున్న దన్నారు. చూసేందు కెళ్ళాను." అన్నాను, ఒకింత సిగ్గుపడుతూ.

గది ఘొల్లు మంది. ★